# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలోని నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది.
- ❖ అసోం రాష్ట్రం ఈశాన్య భారతానికి ప్రధాన ఆరోగ్య కేంద్రంగా మారిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు.
- ❖ దేశ వ్యూహాత్మక సన్నద్ధత, జాతీయ భద్రతలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.
- ❖ దేశవ్యాప్తంగా ఎల్పీజీ (LPG) సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళం, అసోం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) గ్యానేష్ కుమార్ ఢిల్లీలో ఈ రోజు వెల్లడించారు. అసోం, కేరళం, పుదుచ్చేరిలలో ఒకే విడతలో ఎన్నికలు పూర్తి కానుండగా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. అసోం, కేరళం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నది. ఓట్ల లెక్కింపు మే 4న జరుగనుంది. షెడ్యూల్ విడుదలైన తక్షణమే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినట్లు సీఈసీ ప్రకటించారు. ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 824 నియోజకవర్గాల్లో సుమారు 17.4 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 2.19 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా... 25 లక్షల మంది సిబ్బందిని విధుల్లో నియమించనున్నట్లు గ్యానేష్ కుమార్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత పార్లమెంటరీ వ్యవస్థ పట్ల, సభా నియమ నిబంధనలు, సంప్రదాయాల పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అచంచలమైన విశ్వాసం ఉందని లోకసభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం, ప్రధానమంత్రి తనకు రాసిన లేఖపై స్పీకర్ ఈరోజు స్పందించారు. ఈ లేఖలో ప్రధాని వ్యక్తం చేసిన అభిప్రాయాలు అత్యున్నత నైతిక విలువలకు అద్దం పడుతున్నాయని ప్రశంసించారు. ఈ లేఖ ఎంపీలకే కాకుండా, రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు స్ఫూర్తినిస్తుందని ఓం బిర్లా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని, అవే వ్యవస్థకు చైతన్యాన్నిస్తాయని ప్రధాని లేఖలో తెలిపారు. అభిప్రాయభేదాలకు, అగౌరవానికి మధ్య చాలా వ్యత్యాసం ఉందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు సభా మర్యాదలను ఉల్లంఘించే స్థాయికి చేరడం ఆందోళన కలిగించే అంశమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పుడు స్పీకర్ ఓం బిర్లా ప్రదర్శించిన సంయమనం, నిష్పాక్షికత, సమతుల్యత ప్రశంసనీయమని ప్రధాని ఆ లేఖలో కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఎల్పీజీ (LPG) సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, గ్యాస్ సరఫరా నిలిచిపోయిన ఘటనలు ఎక్కడా జరగలేదని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. గత కొద్ది రోజులుగా గ్యాస్ బుకింగ్‌ల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టిందని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెల 13వ తేదీన దేశ వ్యాప్తంగా సుమారు 88 లక్షల గ్యాస్ బుకింగ్‌లు నమోదు కాగా, నిన్న ఆ సంఖ్య 77 లక్షలకు తగ్గిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల రిటైల్ అవుట్ లెట్లలో ఇంధన కొరత ఎక్కడా లేదని, పెట్రోలు, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ నేటి నుంచి రెండు రోజుల పాటు బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో పర్యటించనున్నారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ) హై రిప్రజెంటేటివ్, వైస్ ప్రెసిడెంట్ కాజా కల్లాస్ ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన చేపడుతున్నారు. ఈ పర్యటనలో భాగంగా బ్రసెల్స్‌లో జరిగే `ఫారిన్ అఫైర్స్ కౌన్సిల్` సమావేశంలో జైశంకర్ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఈయూలోని 27 సభ్య దేశాల విదేశాంగ మంత్రులతో ఆయన ప్రత్యేకంగా భేటీ కానున్నారు. కాగా.. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, తాజా పరిణామాలపై జైశంకర్ ఆయా దేశాల అగ్రనేతలతో చర్చలు జరిపారు. నిన్న రాత్రి ఆయన సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) ఉప ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్-నహ్యాన్‌లతో విడివిడిగా ఫోన్‌లో మాట్లాడారు. ఈ చర్చలకు సంబంధించిన వివరాలను జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా పంచుకున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

గత పదేళ్ల బీజేపీ పాలనలో అసోం రాష్ట్రం ఈశాన్య భారతానికి ప్రధాన ఆరోగ్య కేంద్రంగా మారిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు. మెరుగైన వైద్యం కోసం ఈ ప్రాంత ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం మౌలిక సదుపాయాలను మెరుగుపరిచిందని ఆయన పేర్కొన్నారు. గువాహాతిలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో అమిత్ షా.. 2 వేల 090 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు ఆరోగ్య ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య రంగంలో అత్యంత అధునాతనమైన 'ప్రోటాన్ థెరపీ' యంత్రాన్ని ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రంగా అసోం చరిత్ర సృష్టించిందన్నారు. ఇక్కడ ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మారుతున్న కాలానికి అనుగుణంగా యుద్ధతంత్రం పూర్తిగా సాంకేతికమయం అవుతోందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దేశ వ్యూహాత్మక సన్నద్ధతలోనూ, జాతీయ భద్రతలోనూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానమే ఇకపై నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన `ఆల్టర్నేట్ మీడియా కాన్ఫరెన్స్`లో ఆయన మాట్లాడుతూ... భద్రతా వ్యవస్థ, జాతీయ అభివృద్ధిని ప్రభావితం చేసే అంశాల్లో అంతరిక్ష రంగం, అణుశక్తి, కృత్రిమ మేధ (AI), శాస్త్రీయ పరిశోధనలు అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

గంగానది తీరం, వరద మైదానాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గంగా నది పునరుజ్జీవనం, రక్షణ, నిర్వహణకు సంబంధించి గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఏ మేరకు అమలు చేశారో రికార్డుల్లో పొందుపరచాలని కేంద్రాన్ని కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన “పద్మ” అవార్డులు-2027 కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నామినేషన్లను ఆహ్వానించింది. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించేందుకు ఆసక్తి గల వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించనున్నారు. నామినేషన్లు సమర్పించడానికి జూలై 31వ తేదీని ఆఖరి తేదీగా నిర్ణయించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

అసాధారణ పరిస్థితుల దృష్ట్యా పశ్చిమ ఆసియా ప్రాంతంలో 12వ తరగతి పరీక్షలను రద్దు చేస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) ప్రకటించింది. రేపటి నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు జరగాల్సిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. గతంలో వాయిదా వేసిన పరీక్షలను కూడా ఇప్పుడు పూర్తిగా రద్దు చేస్తున్నట్లు బోర్డు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ–కాశ్మీర్ ప్రాంతాల్లో రేపటి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉన్నందున భారత వాతావరణ విభాగం (IMD) ఆయా ప్రాంతాలకు “ఆరెంజ్ అలర్ట్” జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =